సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం । 22 । మే । 2023



విద్యాకానుకలో నాణ్యతా లోపాలు సహించం

జేవీకే కిట్లలో నాణ్యతాలోపాలు ఉంటే సహించేది లేదని పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ స్పష్టం చేశారు. - 8లో



మరింత రుచిగా.. నాణ్యంగా..

ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇచ్చే ఉచిత భోజనం(డైట్) ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. - 8లో



ఖోఖో పోటీలు ప్రారంభం

విజయనగరం వేదికగా రాష్ట్ర స్థాయి అండర్ -19 బాల, బాలికల ఖో ఖో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

అందిన ద్రాక్ష తీయన..



ద్రాక్ష మొక్కకు గుత్తులుగా కాసిన పండ్లు

సీతంపేట: సీతంపేట మెయిన్‌రోడ్డు పక్కన నివసిస్తున్న ఆర్టీసీ కండక్టర్ మూర జాన్ ఇంటి మేడపై వేసిన ద్రాక్ష మొక్కకు కాపువచ్చింది. నల్ల ద్రాక్ష గుత్తుగుత్తులుగా కాపురావడంతో జాన్ సంతోషపడుతున్నారు. రుచిగా ఉన్నాయని చెబుతున్నారు. సీతంపేట వాతావరణం ద్రాక్షపంటకు అనువైనదని, దీనిపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

జూన్ 4న తోటపల్లిలో మహాభిషేకం



వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న హరేకృష్ణ ప్రతినిధులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామాలయంను హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు ఆదివారం సందర్శించారు. వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నాగావళి నదీ తీరాన్ని హరేకృష్ణ, అక్షయపాత్ర సంస్థకు చెందిన నిష్కించన భక్తదాస్, యదురాజదాస్, శృతిసాగర్ దాస్, జితామిత్ర దాస్, భక్తవంశీ, తిలారు శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. హరికృష్ణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీనితాయి, గౌరంగలకు (శ్రీకృష్ణ, బలరాం) దేవస్థానంలో జేష్ఠ పూర్ణిమనాడు (జూన్4న) మహాభిషేకాన్ని నిర్వహిస్తామని ఈఓ బి.ఎల్. నగేష్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పవిత్ర కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు, దాతలు, కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

వెంకటరాజపురంలో ఏనుగుల గుంపు



వెంకటరాజపురం గ్రామంలోకి వచ్చిన ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో ఏనుగులగుంపు సంచరిస్తోంది. పొలాల్లోని వరిధాన్యం, జొన్నలను శనివారం రాత్రి చిందరవందర చేశాయి. ఆదివారం ఉదయం గుమ్మిడిగెడ్డ వాగులోకి చేరుకున్న ఏనుగులు సాయంత్రం గ్రామంలోని వీధుల్లోకి రావడంతో జనం భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

జేవీకే కిట్ల నాణ్యత పరిశీలన

- నాడు–నేడు పనులు సకాలంలో పూర్తిచేయాలి: కలెక్టర్



జియ్యమ్మవలస ఉన్నతపాఠశాలలో జేవీకే స్టాక్ పాయింట్‌లోని కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జియ్యమ్మవలస: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాల పునఃప్రారంభం రోజున జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. జియ్యమ్మవలస జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చేరిన పుస్తకాలు, జేవీకే కిట్లను డీఈఓ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ముందుగా పెదబుడ్డిడి పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు నేడు పనులను తనిఖీ చేశారు. పెదబుడ్డిడి పాఠశాలలో రూ.65.15 లక్షలతో పనులు మంజూరు చేయగా వాటిలో రెండు అదనపు తరగతి గదులను రూ.23.34 లక్షలతోను, నాడు–నేడులో పది అంశాలను సమకూర్చేందుకు రూ.41.81 లక్షలు ఖర్చుచేయాలన్నారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

ఇంటిముంగిటకే వైద్యం



వైద్యో నారాయణో హరి.. వైద్యం చేసేవారిని దేవుడితో సమానంగా చూస్తాం. అటువంటి దేవుళ్లు ఇప్పుడు ప్రతినెలా రెండుసార్లు పల్లెలను సందర్శిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని పరీక్షిస్తున్నారు. జబ్బునయమయ్యేలా ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అవసరమైనవారిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేసి ప్రాథమిక దశలోనే వ్యాధిని నయంచేస్తున్నారు. మంచంపై నుంచి లేవలేనివారి ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. గొప్ప దార్శనికత, దూరదృష్టితో గతేడాది అక్టోబరులో ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఇప్పుడు అద్భుత ఫలితాలను ఇస్తోంది. కొద్దినెలల్లోనే విజయనగరం జిల్లాలో సుమారు 2 లక్షల మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక లక్షా 81 వేల మందికి వైద్యసేవలు అందాయి. ఫ్యామిలీ డాక్టర్ సేవలపై 'సాక్షి' అక్షర రూపం.

- ఫ్యామిలీడాక్టర్ విధానంతో వైద్యరంగంలో సరికొత్త విప్లవం
- మారుమూల గ్రామాలకూ ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- నెలలో రెండుసార్లు వైద్యుడు, వైద్య సిబ్బంది సందర్శన
- పెద్దాస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకొని వచ్చినవారికీ చెకప్‌లు
- ఉచితంగా మందులు అందజేత

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టరు విధానానికి రూపకల్పన చేసింది. గత ఏడాది ఆగస్టు 15న ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. అక్టోబరు 21 నుంచి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి గ్రామాన్ని సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య బందం 104 వాహనాల్లో రెండుసార్లు సందర్శిస్తున్నారు. స్థానికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో రోగులను పరీక్షించి, అవసరమైనవారికి అక్కడే ఉచితంగా మందులను అందజేస్తున్నారు. దీంతో రోగులు వైద్యం కోసం ఒకప్పటిలా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వైజాగ్, విజయనగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవస్థలు తొలగిపోయాయి. ఇంటిముంగిటే వైద్యం అందుతోంది. ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభమైన దగ్గరనుంచి ఇప్పటివరకు విజయనగరం జిల్లాలో 2,06,916 మందికి వైద్యసేవలను అందించారు. అవసరమైన వారికి 14 రకాల పరీక్షలను అక్కడే నిర్వహిస్తున్నారు. దాదాపు 74 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారు. బీపీ, సుగర్ లాంటి జీవనశైలి వ్యాధుల బారిన పడ్డవారికి నెలకి సరిపడా మందులను అందిస్తున్నారు.

పల్లెబాటలో ఫ్యామిలీ డాక్టర్లు...

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద గ్రామాల్లోకి వెళ్లిన వైద్యులు ఉదయం పూట సాధారణ రోగులకు వైద్యం చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి మంచాలకే పరిమితమైన, కదల్లేని రోగులు, వృద్ధులకు ఇళ్లకు వెళ్లి పరీక్షిస్తున్నారు. హాస్టళ్లు, పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సేవలకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఫ్యామిలీ డాక్టర్లను నియమించింది. మరోవైపు బీఎస్సీ ఉత్తీర్ణులైన 482 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లలో సేవలందిస్తున్నారు.

కదిలే వైద్యాలయాలు...

ప్రస్తుతం ప్రభుత్వం అందించిన 104 వాహనాలను చూస్తే కదిలే వైద్యాలయాలుగా ప్రజలు భావిస్తున్నారు. అన్ని రకాల వైద్య పరికరాలు, మందులతో సిద్ధమైన అలాంటి వాహనాలు విజయనగరం జిల్లాలో 47, పార్వతీపురం మన్యం జిల్లాలో 19 అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాల్లో గ్రామాలకు వైద్యులు, వైద్య సిబ్బంది వెళ్లి 20 రకాల వైద్య సేవలను అందిస్తున్నారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 13 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అనుసంధానం చేశారు. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున డాక్టర్లను నియమించారు. వారిలో ఒక డాక్టర్ పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటే, మరొకరు 104 వాహనంలో గ్రామాలకు వెళ్లి సేవలందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్యారోగ్య శాఖల్లోని ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం వైద్య రంగాన్ని పరిపుష్టం చేసింది. సాధారణ ఆరోగ్య తనిఖీలతోపాటు ఈసీజీ లాంటి అత్యవసర పరీక్షలను కూడా ఈ వాహనాల్లో నిర్వహిస్తున్నారు.

గ్రామాల్లోనే వైద్యాలయాలు...

సామాన్యులకు విద్య, వైద్యం అందుబాటులో ఉంచడమే ప్రధాన కర్తవ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రాథమిక వైద్య సేవల విస్తరణలో భాగంగా ప్రతి 2వేల మందికి ఒకటి చొప్పున వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. విజయనగరం జిల్లాలో 482, పార్వతీపురం మన్యం జిల్లాలో 281 సాకారమయ్యాయి. వాటిలో ఒక ఏఎన్ఎం, ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ), ఒక మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎమ్ఎల్‌హెచ్‌పీ), ఒక ఆశ వర్కర్ చొప్పున అన్ని క్లినిక్‌ల్లో ప్రభుత్వం నియమించింది. ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు, వైద్యపరీక్షల కిట్లు, మందులు అందుబాటులో ఉంటున్నాయి. గ్రామ స్థాయిలో నయం కాని ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని పీహెచ్‌సీకి, మరీ తీవ్రంగా ఉంటే సీహెచ్‌సీ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులకు కూడా స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విలేజ్ క్లినిక్‌లకు టెలీ మెడిసిన్, టెలీ హబ్‌ల ద్వారా మెడికల్ ఆఫీసర్‌తో పాటు ప్రత్యేక సర్వీసులు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యసమాచారం

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ కిట్స్, 74 రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతీఒక్కరికీ వారి ఇంటి వద్ద వైద్యపరీక్షలు జరిపి, వారి ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలను, వారి అనుమతితో డిజిటలైజ్ చేస్తున్నారు. ప్రతి పౌరుడికి ఒక డిజిటల్ హెల్త్ ఐడీ నంబర్‌ను కేటాయిస్తున్నారు. దీనిని ఫ్యామిలీ డాక్టర్ విధానంతో అనుసంధానం చేస్తారు. భవిష్యత్‌లో ఆరోగ్యశ్రీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఏకీకృతం చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

'ఫ్యామిలీ డాక్టరు' ఆధ్వర్యంలో సేవలిలా...

అంశం	విజయనగరం జిల్లా	పార్వతీపురం మన్యం జిల్లా
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	482	281
వైద్యులు పరీక్షించిన వారి సంఖ్య	2,06,916	1,81,325
జనరల్ ఓపీ	1,30,872	99,333
కౌమార బాలికలు	95	109
ఏఎన్‌సీ (బాలింతలు)	11,730	16,811
పీఎన్‌సీ (గర్భిణులు)	5,934	6,777
అనీమియా బాధితులు	1281	3,433
బీపీ బాధితులు	27,423	33,548
మధుమేహ వ్యాధిగ్రస్తులు	15,607	15,597
బీపీ, సుగర్ బాధితులు	12,478	4,753
నోటి కేన్సర్	289	387
రొమ్ము కేన్సర్	245	90
గర్భాశయ కేన్సర్	861	480
టీబీ వ్యాధిగ్రస్తులు	101	7

ప్రాణదాత..

చిత్రంలో మంచంపై ఉన్న వ్యక్తి పేరు బోల రాములు. సీతానగరం మండలం ఆర్.వెంకంపేట. కడుపునొప్పి తీవ్రం కావడంతో ఆరోగ్యశ్రీ కింద విశాఖపట్నంలో శస్త్రచికిత్స చేశారు. ఆరోగ్యం కుదుటపడింది. ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు, పీహెచ్‌సీ వైద్యులు ప్రతినెలా రెండుసార్లు ఇంటికి వచ్చి వైద్యపరీక్షలు చేస్తున్నారు. అవసరమై మందులు అందజేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారు.



ఫ్యామిలీ డాక్టర్ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు...

ఈసీజీ, హిమోగ్లోబిన్, గర్భ నిర్ధారణకు యూరిన్ టెస్ట్, ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్), మలేరియా టెస్ట్, హెచ్ఐవీ టెస్ట్, డెంగీ టెస్ట్, మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్, అయోడిన్ టెస్ట్, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి పరీక్ష, ఫైలేరియాసిస్ పరీక్ష, సిఫిలిస్ ర్యాపిడ్ టెస్ట్, విజువల్ ఇన్‌ఫెక్షన్, స్పూటమ్ కల్చర్

పద్మాపురం గ్రామంలో రోహన్‌కు ఇంటివద్దనే వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చిరంజీవి



ఇంటి వద్దనే వైద్యం

నా పేరు వలితేటి ఉమ. మాది పాలకొండ మండలం పద్మాపురం గ్రామం. మధ్యతరగతి కుటుంబం. నాలుగేళ్ల కుమారుడు రోహన్ కొద్ది రోజులుగా ఆయాసంతో ఇబ్బంది పడుతున్నాడు. పిల్లాడికి వైద్యం చేయించాలంటే స్వగ్రామం నుంచి మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి. లేదంటే ఎం.సింగపురం పీహెచ్‌సీకి తీసుకువెళ్లాల్సిఉండేది. ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీడాక్టర్ విధానంతో వైద్యులు ఇంటికి వచ్చి ఎప్పటికప్పుడు మా పిల్లాడి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తూ మానసిక ధైర్యాన్ని నింపుతున్నారు.

ఆరోగ్యానికి భరోసా..

ఈ ఫొటోలో ఉన్న బాలింత పేరు కె.సుజాత. ఈమెది పార్వతీపురం మండలంలో మారుమూల గ్రామమైన వెలగవలస. ఈ నెల 12వ తేదీన ఈమెకు జిల్లా ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ చేశారు. ప్రస్తుతం ఇంట్లోనే ఉంటుంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులు, ఏఎన్ఎం ఇంటికి వచ్చి వైద్యసేవలందిస్తుండడంతో ఆనందం వ్యక్తంచేస్తోంది. పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్న ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



వైద్యుల షెడ్యూల్‌ను ముందే ప్రకటిస్తున్నాం

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్యులు గ్రామాల్లోకి వెళ్లే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తున్నాం. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం ఉంటుంది. ఫలితంగా అవసరమైన వారంతా ఈ సేవలను వినియోగించుకొనేందుకు వీలు అవుతుంది. ఒక వేళ ఎక్కడైనా ఒక డాక్టర్ సెలవు పెడితే, అక్కడ సేవలు ఆగిపోకుండా కొంతమంది వైద్యులను రిజర్వులో ఉంచి, నిరంతరాయంగా సేవలను అందించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రామీణ ప్రజలంతా తమ ఊరిలోకే వచ్చి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– నిశాంత్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్

బీచ్‌ల పరిశుభ్రతతో పర్యాటక అభివృద్ధి

- చింతపల్లి తీరంలో వ్యర్థాల తొలగింపు
- పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి



చింతపల్లి బీచ్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్

పూసపాటిరేగ: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా బీచ్‌ల పరిశుభ్రత కోసం చేపట్టిన స్వచ్ఛతా జన్ భాగీదారి–సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని చింతపల్లి తీరంలో ఆదివారం నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వివిధ పరిశ్రమలకు చెందిన ఉద్యోగులతో కలిసి తీరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ముందుగా జీ20 మెగాబీచ్ క్లీన్ ఆఫ్ క్యాంపెయిన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కాలుష్యం, వ్యర్థాల నుంచి సముద్రాలను రక్షించుకుంటామని, సముద్ర జీవులకు ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, భూమిపై జీవించే సమస్త జీవరాశికి స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సముద్రం ముఖ్యమని, స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన జీవనశైలిని అవలంబిస్తామంటూ కలెక్టర్‌తో పాటు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చింతపల్లి బీచ్‌లో ఫిషింగ్‌జెట్టీ నిర్మిస్తున్నందున ఆ ప్రాంతంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టినట్టు కలెక్టర్ వెల్లడించారు. తీరం పరిశుభ్రంగా ఉంటే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

పర్యావరణ అనుకూల ఉత్పత్తుల పరిశీలన

విజయనగరానికి చెందిన ఎంపీ పాలిమర్స్, మహేష్ ప్రొడక్ట్స్ సంస్థలు పర్యావరణ అనుకూలమైన పదార్థాలతో తయారు చేసిన ప్లేట్‌లు, గ్లాసులు, క్యారీబ్యాగుల స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. చెరకు పిప్పిని ఉపయోగించి ఈ వస్తువులు తయారు చేసినట్టు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. స్టాల్స్ పరిశీలనలో ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్, హెచ్‌బీఎల్, మైలాన్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా, ఐఏడీ ప్యారీ, మా మహామాయ పరిశ్రమ ప్రతినిధులు, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలుష్యనియంత్రణ మండలి అధికారి టి.సుదర్శనం, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ జి.రామారావు, జిల్లామత్స్యకార సంఘం అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న, మెరైన్ సీఐ వైకుంఠరావు, సర్పంచ్ బర్రి ముసలి, ఎంపీటీసీ మైలపల్లి తాత తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిబీచ్‌లో వాక్‌థాన్ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి
- డీఈఓ నిమ్మక ప్రేమ్‌కుమార్

కురుపాం: శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ నిమ్మక ప్రేమ్‌కుమార్ కోరారు. కురుపాం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆదివారం పరిశీలించారు. బోధన తీరుపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. అనంతరం జగనన్న విద్యాకానుకల నిల్వపై ఎంఈఓ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కేజీబీవీ ఎస్ఓ కిరణ్‌కుమారి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎమ్ శంకరరావు, సీఆర్పీ నరేష్ ఉన్నారు.



కురుపాం కేజీబీవీ బాలికలతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

అదరగొట్టిన ఆతిథ్య జిల్లా జట్లు

- అండర్–19 కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన విజయనగరం జట్లు
- బాలుర విభాగంలో ప్రథమ స్థానం... బాలికల విభాగంలో తృతీయ స్థానం
- ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన విజయనగరం జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీ బెల్లాన

విజయనగరం: రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో ఆతిథ్య విజయనగరం జట్లు సత్తాచూపాయి. బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా.. బాలికల జట్టు తతీయ స్థానం దక్కించుకుంది. విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు (ద్వితీయ), శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా... ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో ఆతిథ్య విజయనగరం జట్టు నిలిచాయి. విజేత జట్లకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్తా చాటాలని ఆకాంక్షించారు. విజయనగరంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విజయనగరం జిల్లా క్రీడలకు, కళా రంగానికి పుట్టినిల్లుగా పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులను ప్రోత్సహించడంలో జిల్లా అసోసియేషన్ మంచి సేవలందిస్తుందని హామీ ఇచ్చారు. జిల్లాలో ఏ క్రీడా పోటీలు జరిగినా వ్యాయామ ఉపాధ్యాయుల చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడా రంగాన్ని ప్రోత్సహించి పారితోషికాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో డీవీఈఓ సురేష్ బాబు, టోర్నమెంట్ పరిశీలకుడు జయరాజ్, అండర్–19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్.వి.రమణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, బొమ్మాన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు, తౌడుబాబు, కె.ఎ.బాలకష్ణ, ఏపీ పోలీస్ టీమ్ కోచ్ పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో తృతీయ స్థానం దక్కించుకున్న ఆతిథ్య విజయనగరం జట్టు

క్లుప్తంగా

రామతీర్థం ఆలయాన్ని సందర్శించిన కేసలి


స్వామిని దర్శించుకుంటున్న కేసలి అప్పారావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మెన్ కేసలి అప్పారావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాలని హితవు పలికారు. బాలల భిక్షాటనను ప్రోత్సహించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యుడు తిరుమురెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

30 ట్రాక్టర్ల ఇసుక సీజ్


ఎస్సై హరిబాబు నాయుడు సీజ్ చేసిన ఇసుక

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను గుర్ల ఎస్సై హరిబాబు నాయుడు గుర్తించి ఆదివారం సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేసి రాత్రి సమయంలో లారీలకు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఇసుక అక్రమంగా నిల్వ చేసిన ప్రదేశాలను గుర్తించి సీజ్ చేశామని ఎస్సై ఈ సందర్భంగా తెలిపారు. ఇసుకను అనుమతులు లేకుండా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుక సుమారు 30 యూనిట్లు ఉంటుందని అంచనా వేశారు.

'రేపటి సూర్యోదయం కోసం' కవితకు రెండో బహుమతి


పి.రోహిణి కుమార్

పార్వతీపురం: డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీలో తాను రాసిన 'రేపటి సూర్యోదయం కోసం' కవితకు రెండో బహుమతి వచ్చినట్లు ఉపాధ్యాయుడు పల్ల రోహిణికుమార్ ఆదివారం తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా వాసా ఫౌండేషన్ దేశభక్తి-పురోగతి, జాతీయత ప్రధానాంశాలుగా పోటీలను నిర్వహించిందన్నారు. ఈ పోటీలలో న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ విమర్శకుడు ఎం.నారాయణశర్మ వ్యవహరించారు. ఈ పోటీలలో విజేతలకు జూన్ 6న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని వివరించారు.

రేకుల షెడ్ పడి ఆవు మృతి


మృతిచెందిన ఆవు

సాలూరు: మండలంలోని శివరాంపురం గ్రామంలో వీచిన ఈదురుగాలులతో ఆదివారం గ్రామంలో రహదారికి అడ్డుగా చెట్లు విరిగిపడ్డాయి.పలువురు రైతులు రేకుల షెడ్‌లు గాలికి ఎగిరిపోగా, కొన్ని కూలిపోయాయి. రేకుల షెడ్డు పడి అవనాపు నాగరాజుకు చెందినపాడి ఆవు మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని , పలువురు రైతుల రేకులషెడ్‌లు నేలకూలడంతో లక్షలాది రుపాయల నష్టం వాటిల్లిందని సర్పంచ్ జర్జాపు మోహన్ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 499.00
విజయనగరం	రూ. 495.00
శ్రీకాకుళం	రూ. 495.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,420-00
బంగారం(22సి. 10గ్రా.)	56,300-00
వెండి (కిలో)	79,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264

మరింత రుచిగా.. నాణ్యంగా..

- ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల భోజనం ఖర్చు పెంచిన ప్రభుత్వం
- మెరుగైన వైద్యంతో పాటు రుచికర, నాణ్యమైన ఆహారం
- వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు దోహదం
- రోగి సహాయకులకు కూడా ఉచితంగా భోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న జనం


ఆస్పత్రిలో రోగులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

సీతంపేట: ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇచ్చే ఉచిత భోజనం(డైట్) ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇంతవరకు రూ.40గా ఉన్న రోజువారీ ఖర్చును ఇప్పుడు ఏకంగా రూ.80 నుంచి రూ.100 చేసింది. దీంతో రోగులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు మార్గం సుగమమైంది. ప్రతిరోజూ ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతలు, రోగులకు ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం పెట్టేవారు. దీనికోసం ప్రభుత్వం రూ.40 చెల్లించేది. ఆ మొత్తం సరిపోవడం లేదని ప్రభుత్వానికి వినతులు వచ్చిన నేపథ్యంలో ఆ భోజనం ఖర్చును రెట్టింపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదేకాకుండా రోగికి సహాయంగా వచ్చిన వారికి కూడా భోజనం వసతి కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గతంలో ఇంటి నుంచి భోజనం..

గతంలో ఏ ప్రభుత్వాలూ ఆస్పత్రుల్లోని రోగులకు అందించే ఆహారం(డైట్)పై అంతగా దృష్టిసారించలేదు. నామమాత్రంగానే వారికి భోజనానికి అయ్యే ఖర్చులు చెల్లించేవారు. దీంతో అంతగా నాణ్యత లేని ఆహారం వారికి అందేది. కొంతమంది రోగులు అయితే ఈ ఆహారం మానేసి, దగ్గరలోని తమ బంధువుల ఇంటి వద్ద నుంచి భోజనం తెప్పించుకునే పరిస్థితి ఉండేది. ఆ సౌకర్యం కూడా లేని వారైతే ఆస్పత్రిలో ఇచ్చే భోజనమే మహాప్రసాదంగా భావించేవారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోగులు, రోగి సహాయకులకు కూడా పౌష్టికాహారం ఇచ్చేందుకు డైట్ చార్జీలు పెంచడాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. రోజుకు మూడు పూటలా చక్కనైన ఆహారం అందుతుండడంతో రోగులు కూడా సంతోషిస్తున్నారు.

మెనూ వివరాలిలా..

ఉదయం: గోధుమ రవ్వ ఉప్మా, టమాటా బాత్, బ్రెడ్(వీటిలో ఏదో ఒకటి), అదనంగా 100 మిల్లీలీటర్ల పాలు

మధ్యాహ్నం: అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు

సాయంత్రం: అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు గర్భిణులు, బాలింతలకు అన్నం, ఆకుకూర పప్పు, గుజ్జు కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటిపండు, వేరుశనగ పట్టీ, జామకాయ, రాగిజావ

నిరంతర పర్యవేక్షణ..

కొత్త మెనూ చార్జీల ప్రకారం ఆస్పత్రిలోని రోగులకు భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయంపై అధికారులతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. కిచెన్ రూమ్‌లో తయారీ దగ్గర నుంచి రోగుల వద్దకు వచ్చే ఆ ఆహారం వచ్చే వరకు నాణ్యత, తనిఖీలు, రికార్డుల నిర్వహణ ఉంటుంది. కూరలో ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా, అరటిపండ్లు కుళ్లిపోయినా వాటి వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తారు. రోగికి సక్రమంగా ఆహారం అందిస్తున్నారా లేదా అని కూడా గమనిస్తారు.

భోజనం బాగుంది..



అనారోగ్యం కారణంగా నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాను. అప్పటి నుంచి ఇప్పటివరకు నాకు ఇచ్చిన ఆహారం బాగుంది. రుచితో పాటు నాణ్యత కూడా భలేగుంది. నాణ్యమైన వైద్యం, భోజనం సరఫరా చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– టి.కృష్ణయ్య, రోగి, ఆడలి.

ప్రతిరోజూ పౌష్టికాహారం ఇస్తున్నారు..



ఈ నెల 16వ తేదీన ఆస్పత్రికి వచ్చాను. ప్రతిరోజూ పౌష్టికాహారంతో కూడిన ఆహారమందిస్తున్నారు. ఇక్కడే ఉంటే ఏ బెంగ, బెదురు లేదు. తనతో పాటు ఉన్న వారికి కూడా భోజనం ఇస్తున్నారు.
– సవర సుమతి, గర్భిణి, నారాయణగూడ.

పకడ్బందీగా మెనూ అమలు..



ఆస్పత్రుల్లోని రోగులకు అందించే భోజనం మెనూ పకడ్బందీగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ ఎటువంటి పొరపాటు జరిగినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.
– బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, సీతంపేట

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

- అండర్ – 19 విభాగంలో పాల్గొన్న వివిధ జిల్లాల జట్లు


రాష్ట్ర స్థాయి అండర్ -19 ఖో ఖో పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విజయనగరం వేదికగా రాష్ట్ర స్థాయి అండర్ -19 బాల, బాలికల ఖో ఖో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో ముందుగా కబడ్డీ, ఖోఖో క్రీడల పితామహుడు స్వర్గీయ భగవాన్ దాస్ మాస్టారి విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్ కౌశిక్, జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, అండర్ -19 రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల అబ్జర్వర్ కె. పట్టాభిరామ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ ఖోఖో, కబడ్డీ క్రీడలకు విజయనగరం ప్రసిద్ధి గాంచిందన్నారు. రాష్ట్ర పోటీలు విజయనగరం గడ్డపై నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం కూడా అన్ని విధాలా క్రీడలను ప్రోత్సహిస్తోందని, క్రీడాకారులు బాగా ఆడి మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.మల్లేశ్వరరావు, అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కష్ణ, కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు బాలకష్ణ, గోపాల్, మల్లికార్జున్,హరీష్, బి.శ్రీను అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలుర జట్లు 8..బాలికల జట్లు 6

రాష్ట్ర స్థాయి అండర్ -19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల ఖో ఖో పోటీలను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని 8 జిల్లాలకు చెందిన బాలుర జట్లు, 6 జిల్లాల నుంచి బాలికల జట్లు పాల్గొన్నాయి. ముందుగా బాలుర విభాగంలో విజయనగరం - చిత్తూరు జట్లు, ప గో జిల్లా - ప్రకాశం జిల్లాల జట్ల పోటీలను ప్రారంభించారు. సోమవారం సాయంత్రం వరకు జరగనున్న పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి అండర్ -19 పోటీలకు ఎంపిక చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

నవ్విపోదురు గాక..!

- ఇళ్ల స్థలాలను శ్మశానంతో పోల్చడం జుగుప్సాకరం
- చంద్రబాబు వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఫైర్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సొంతిల్లు లేని నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పంపిణీచేసిన ఇళ్ల స్థలాలను టీడీపీ అధినేత చంద్రబాబు శ్మశానంతో పోల్చడం జుగుప్స కలిగిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌కోట పర్యటనకు విచ్చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబు..ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు శవాన్ని పూడ్చడానికి కూడా చాలవని మాట్లాడడం ఆయన పెద్దరికాన్ని తెలియజేస్తోందన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చెయ్యని విధంగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పార్టీలు, రాజకీయాలకు అతీతంగా 30 లక్షల ఇళ్ల పట్టాలను పేదలకు పంపిణీ చేశారన్నారు. ఇల్లు నిర్మించుకోవడానికి సొంత స్థలాల్లేని పేదలు ప్రభుత్వం పంపిణీచేసిన స్థలాల్లో నిర్మించుకుని, ఆనందంగా నివసిస్తున్నారని చెప్పారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులే వారి సొంత ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గత టీడీపీ ప్రభుత్వం స్పష్టం చేసిందని ఎమ్మెల్సీ గుర్తుచేశారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2.62 లక్షల మంది టిడ్కో లబ్ధదారులకు ఉచితంగా ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలు చేశారన్నారు. నాలుగేళ్ల కాలంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి ఓర్వలేకనే చంద్రబాబు, టీడీపీ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు పెత్తందార్ల కోసం ఆరాటపడుతుంటే జగన్ మోహన్ రెడ్డి పేదవారి అభివృద్ధి, అభ్యున్నతి కోసం తపన పడుతున్నారన్నారు.

రాష్ట్రంలో ఇద్దరు సైకోల పర్యటన

- రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు


మాట్లాడుతున్న రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు

కొత్తవలస: అధికారం కోల్పోయిన నాటి నుంచి మైండ్ బ్లాక్ అయి రాష్ట్రంలో ఇద్దరు సైకోలు పర్యటిస్తున్నారని అందులో ఒకరు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాగా రెండో వ్యక్తి ఆయన సుపుత్రుడు నారా లోకేష్. వారిద్దరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు సూచించారు. మండల కేంద్రంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి రాష్ట్రంలో కేవలం 23 ఎమ్మెల్యే స్థానాలు దక్కాయని రానున్న సాధారణ ఎన్నికల్లో ఆ స్థానాలు కూడా దక్కవని తెలిసి ఆపార్టీ అధినేత చంద్రబాబు వారానికో ప్రాంతం వెళ్లి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం జననేత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్.కోట నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకుపోతోందన్నారు. ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు నియోజకవర్గంలో సుమారు రూ.230 కోట్లు వెచ్చించి పనులు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు బహిరంగ సభలంటే ఆ పార్టీ స్థానిక నేతలే హడలిపోతున్నారు. ఆయన సమావేశాలకు జనం రాకపోతే ఎక్కువ సొమ్ము ముట్టజెప్పి బలవంతగా సభలకు జనాన్ని రప్పిస్తున్నారని తీరా వచ్చిన జనం చంద్రబాబు ప్రసంగం పూర్తి కాకముందే వెనుదిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అరసం కార్యనిర్వాహక సంఘం ఏర్పాటు


ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా అభ్యుదయ రచయితల సంఘం(అరసం) కార్యనిర్వాహక సంఘం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా అరసం అధ్యక్షుడిగా చింతా అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడిగా పల్ల రోహిణి కుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలకొల్లు రామలింగస్వామి, కోశాధికారిగా పిల్లా లక్ష్మణరావులను ఎన్నుకున్నారు.

కార్యవర్గ సభ్యులుగా అధికారి రవికుమార్, ఆగూరు రామారావు, గొట్టాపు తిరుపతిరావు, ఎం.రామారావు, పల్ల మోహనరావు, ఊల్ల రాము, సారిపల్లి నాగరాజు, తోటపల్లి శేఖర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం నేతలు మాట్లాడుతూ అంతా కలిసికట్టుగా ఉండి మన్యం జిల్లాలో అరసం ద్వారా సాహిత్యాన్ని పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు.

గల్లంతైన మరోవ్యక్తి మృతదేహం లభ్యం


సీతారాం మృతదేహం

పాచిపెంట: మండలంలోని పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుల ధాటికి రెండు పడవలు బోల్తాపడి ఇద్దరు వ్యక్తులు గల్లంతైన ఘటనలో ఒకరి మృతదేహం శనివారం లభ్యం కాగా, మరో వ్యక్తి పుంగారి సీతారాం మృతదేహం కూడా ఆదివారం లభ్యమైంది. సీతారాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఆస్పత్రికి తరలించినట్లు పాచిపెంట ఎస్సై వెంకటరమణ తెలిపారు.గల్లంతైన సీతారాం తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు కోటి ఆశలతో ఎదురుచూడగా మృతిచెందిన విషయం తెలిసి హతాశులయ్యారు. భర్త మృతి చెందడంతో తనకు పిల్లలకు దిక్కెవరు అంటూ భార్య విలపిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది.

కౌలు రైతులకు మేలు

- గత ఏడాది 5,699 మందికి కార్డులు
- ఈ ఏడాది లక్ష్యం 10,176

విజయనగరం ఫోర్ట్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం భూమి లేని నిరుపేద రైతులకు మేలు చేయాలని సంకల్పించింది. అందులో భాగంగా భూయజమానుల దగ్గర భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కౌలు రైతులను గుర్తించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది కంటే ఈఏడాది ఎక్కువ మందిని గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో గత ఏడాది 5699 మంది కౌలు రైతులను గుర్తించారు. అయితే ఈఏడాది ఎక్కువగా 10,176 మందిని గుర్తించేందుకు అధికారులకు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఈమేరకు కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమం జిల్లాలో మొదలైంది.

1000 మందికి కార్డుల అందజేత

పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించాం. 1000 మందికి కార్డులు అందజేశాం. వచ్చే నెల 15 వతేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కౌలు రైతుల ప్రక్రియ పూర్తయిన వెంటనే గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.
వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

యువకుడిపై హత్యాయత్నం..!

- మెడ, గొంతుపై కత్తి గాట్లు
- హుటాహుటిన రాజాం ఆస్పత్రికి తరలింపు


కత్తిగాయాలకు గురైన రమణ

రేగిడి: ప్రశాంత వాతావరణం కలిగిన మండలంలో ఓ యువకుడిపై జరిగిన హత్యాయత్నం ఘటన కలకలం రేపింది. సంకిలి గ్రామం వద్ద ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై సంకిలి సుగర్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న పాలకొండకు చెందిన లక్ష్మీనారాయణ కత్తితో దాడికి పాల్పడ్డాడు. లక్ష్మీరనారాయణ పాలకొండ తిరుమల కన్‌స్ట్రక్షన్స్ సూపర్‌వైజర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. తిరుమల కన్‌స్ట్రక్షన్‌కు బాధితుడు రమణ మెటీరియల్ అద్దెకు ఇచ్చేవాడు. ఈ నేపథ్యంలో రమణకు ఇవ్వాల్సిన రూ.4.75 లక్షలు నగదు తిరుమల కన్‌స్ట్రక్షన్ కొంతకాలంగా ఇవ్వడం లేదు. ఈ అద్దె ఇవ్వాల్సిందేనని రమణ ప్రతి రోజూ సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వచ్చే తిరుమల కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణను డిమాండ్ చేస్తున్నాడు. దీంతో వీరిద్దరి మధ్య కొద్దిరోజులుగా రోజూ వివాదం జరుగుతోంది. చివరికి లక్ష్మీనారాయణ ఆవేశం ఆపుకోలేక తనతో తీసుకొచ్చిన చాకుతో రమణపై మెడతో పాటు గొంతుపై కత్తితో పొడవగా తీవ్రగాయాలపాలయ్యాడు. రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతున్న రమణను వదిలేసి లక్ష్మీనారాయణ అక్కడినుంచి పరారయ్యాడు. స్థానికులు వెంటనే స్పందించి రమణను 108 వాహనం ద్వారా రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు రాజాం ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. రమణకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆస్పత్రి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న రేగిడి ఎస్సై ఇ.శ్రీనివాసరావు రాజాం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. అనంతరం సంకిలిలో సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ముమ్మరం చేశామని నిందితుడు పరారీలో ఉండడంతో పాటు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యాకానుకలో నాణ్యతా లోపాలు సహించం

- ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాశ్


విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాం కొలతలను చూస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాశ్

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేస్తున్న జగనన్న విద్యాకానుకలో నాణ్యతా లోపాలు ఉంటే సహించేది లేదని పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు లక్కవరపుకోటలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్‌పాయింట్‌కు చేరుకున్న వస్తువులను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు అందజేస్తున్న యూనిఫాం క్లాత్‌ను క్షుణ్ణంగా పరిశీలించి కొలతలు సేకరించారు. క్వాలిటీ, క్వాంటిటీలో తేడాలు ఉంటే వెంటనే నివేదించాలని సూచించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి ప్రతి మారుమూల గ్రామంలో గల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక చేరాల్సిందేనని స్పష్టం చేశారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 1803 పాఠశాలలకు సంబంధించి జగనన్న విద్యా కానుకలు స్టాక్ పాయింట్లకు 60 శాతానికి పైగా పంపించామన్నారు. మరో వారం రోజుల్లో వందశాతం స్టాక్ పాయింట్లుకు కిట్లును పంపిస్తామని తెలిపారు. అలాగే పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఫేజ్-2లో నాడు-నేడు పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ జ్యోతికుమారి, ఎంఈఓ సీహెచ్. కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై పలు కేసుల నమోదు

పాలకొండ రూరల్: ఇటీవల పాలకొండ ఏరియా ఆస్పత్రిలో జరిగిన లైంగిక దాడి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు జి.వినోద్‌కుమార్‌ను ఆదివారం అరెస్టు చేశారు. ఈ ఘటనలో బాధితురాలి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సోతోపాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సీ, ఎస్టీ సెల్ విచారణ విభాగం (పార్వతీపురం మన్యం జిల్లా) డీఎస్పీ, ఇన్‌చార్జి డీఎస్పీ జి.మురళీధర్ తెలిపారు.